# అనుభవం

* శ్రీ బందా రామమోహనరావు *

★

మానవుని జీవితానికి చాలా సన్నిహితంగా ఉంటూ, ఏ మానవుని జీవితగాథను విన్నప్పుడుగాని, చెప్పేటప్పుడుగాని సాధారణంగా వినబడేమాట— అనుభవం—ఈ పదాన్ని నిర్వచించటం కష్టసాధ్యమైన పని. హృదయంపై తీవ్రంగా పనిజేసే ఒక గట్టి దెబ్బలాంటివి ఈ అనుభవాలు...మానవ జీవితానికి మెరుగులు దిద్ది అత్యున్నత స్థానాన్ని పొందేటట్లు చేయగలిగేది, అధోగతిలోనికి తీసుకొనివచ్చేదీ ఈ అనుభవమే...ఏదైనా అనుభవం అనేది సామాన్యమైనది కాదు...ఆనందపాత్రనుగాని, దుఃఖపాత్రనుగాని చేతికి యిచ్చేదికూడా ఈ అనుభవమే...విచిత్రమైన సంఘటనలు అనుభవాలుగా విచిత్రమైన మార్పులను తీసుకొనివస్తాయి...తీవ్రంగా ఆలోచిస్తే ఈ అనుభవాలను పొందే మానవులు రెండు తరహాలుగా ఉంటారు....ఈ రెండు రకాలకు హస్తిమశకాంతరం భేదం ఉంటుంది. మొదటిరకం వ్యక్తులు సాధారణంగానే ఉంటారు. కారణం అనుభవాన్ని చాలా తేలికగా విలువలేనిదిగా భావిస్తారు. మానసికంగా గోచరించే మార్పులకు అనుగుణ్యంగా నడచుకుంటారు...అందులోనే ఒక విధమైన ఆనందానుభూతిని పొందుతారు...కష్టమైనా, సుఖమైనా, ఒడుదుడుకులు ఉన్నా లేకపోయినా నిశ్చింతగా, నిర్విచారంగా కాలంగడుపుతారు. ఈ మొదటిరకపు వ్యక్తులనుచూస్తూంటే నిజంగా నవ్వువస్తుంది. తాము చేసేదాంట్లో తప్పుఅనేది లేదనిఉన్నా సరిదిద్దుకొనే పాటి శక్తి తమకు వున్నదని, అందుచే అనుభవాలను చాలా తేలికగా చూస్తూంటామనీ, అవి కలుగజేసే మార్పులు చిన్నవైనా, గొప్పవైనా వానితో తమకు నిమిత్తంలేదని నిశ్చింతగా హాయిగా కాలం వెళ్ళబుచ్చవచ్చనీ చెప్పుతుంటారు...విపరీతంగా వింతగా ఉంటాయి వారి మాటలు...

ఇక రెండవ తరహాకు చెందిన వ్యక్తులు మనకు చాలా అరుదుగా కాన్పిస్తారు. కారణం వారు మానవులకు చాలాదూరంగా ఉంటూ, మానవ జీవితానికి అతీతులుగా ఉంటారు...విపరీతప్రవర్తన వారి ముఖ్యగుణం...ఎంతమందిలో వున్నా వారినిగుర్తుపట్టటం చాలా తేలిక. తామరాకుమీది నీటిబిందువులె ఈ ప్రపంచానితో సంబంధం కలిగిఉంటారు...వారి భావాలు విచిత్రంగాను, విలక్షణంగాను ఉంటాయి... ఆంగ్లేయ పరిభాషలో చెప్పాలంటే సూపర్ హ్యూమన్లుగా ఉంటారు...అనుభవాలకు తూచిపడిగట్టి చక్కని విలువనిస్తారు...తమ జీవనయాత్రలో అమోఘమైన మార్పులు తీసుకొనివచ్చేవే ఈ అనుభవాలంటారు. ఇంకా తీవ్రధోరణిలో మాట్లాడితే అనుభవాలే తమ జీవితాలంటారు. ...వారి భాష, పలుకులు మనకు రుచించవు...నిఘంటువులు వెదకి సరియైన పదాలను వేస్తూవుంటారు. నిజంగా అనుభవాలు వారిలో గొప్ప మార్పులను తీసుకొని వస్తాయి...ఆ పరిణామాలకు ఆదుకోలేక తబ్బిబ్బై తుదకు వాటికి దాసోహమై పోతారు. అప్పుడు అనుభవమనేది వారిపై అధికారాన్ని చలాయిస్తుంది...వీరి జీవితం చూస్తూంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఇంతలో మరొక అనుభవాన్ని పొందుతుంది వారి జీవితం... ఈ రెండు అనుభవాల మధ్య పడి నలిగిపోతూ వుంటారు...ఆనందమైనా, దుఃఖమైనా అనుభవించటానికి ఉద్యుక్తులై తుదకు చిరునవ్వుతో ఆహ్వానిస్తారు దేనినైనా...ఆ రెండు అనుభవాల వివాదఫలితమే ఆత్మహత్యలు, విషంత్రాగి మరణించటం ఇత్యాదివి...వారిలో గొప్పవారు మనకు ఎక్కువగా కనిపిస్తూంటారు. రాజకీయ దురంధరులు, విజ్ఞానవేత్తలు, తత్వశాస్త్రజ్ఞులు, ప్రేమికులు తుదకు పిచ్చివారుకూడా ఈ తరహాకు చెందుతారు... వారిలో జీవితాలను పరిశీలిస్తూంటే మనకు అదొక అనుభవమైపోతుంది...ఇంతకు, మిత్రుడు తారకం సంసా

రయాత్రలో పొందిన అనుభవాన్ని (ప్రథమ) బట్టి ఈ వ్యక్తి ఏ రకానికి చెందుతాడో గ్రహించండి!

తారకం అందరితోపాటుగా కొద్దో, గొప్పగానో చదివాడు...స్కూల్ ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు...సంసార బాధ్యతలు అతన్ని పూర్తిగా ఆవరించాయి. కుదకు విద్యకు స్వస్తిచెప్పి తాలూకాఫీసులో గుమాస్తాగా తయారయ్యాడు. తండ్రి చిన్నతనంలోనే ఒంటరిగాణ్ణిచేసి వెళ్లిపోయాడు...ఒక్కడే కుమారుడు కాబట్టి ఎంతో అల్లారుముద్దుగా పెంచింది తల్లి...తాను కష్టపడి సంపాదించి, కుమారుని పోషిస్తూ చదివించింది...మొదటినుండి తారకం చాలా బుద్ధిమంతుడు కాబట్టి త్వరగానే స్కూల్ ఫైనల్ క్లాసుకు రాగలిగాడు...ఏమాత్రం ఆస్తిలేదు వారికి...అందుచే చుట్టాలు వారిని కొంచెం దూరం ఉంచినా, ఏ లోటు రాకుండా చూసేది అతని తల్లి. తల్లికి ఎదురు చెప్పటమంటే ఘోర పాతకానికి ఒడికట్టినట్లుగా బాధ పొందేది అతని హృదయం...తనకు నచ్చిన సంబంధాన్ని చూసి ముడిపెట్టింది తల్లి...ఇంతలో తానొక గృహస్తుడై, తన మీద ఒక పెద్ద బరువు మోపబడుతుందని ఎన్నడూ అనుకోని తారకాన్ని వివాహం అంటే అంతగా యిష్టం లేకపోయినప్పటికీ తల్లి ఆజ్ఞకు తలఒగ్గి ఒక అర్ధాంగిని సంపాదించాడు...పెండ్లి అయిన కొలది కాలానికే తన విద్యుక్త ధర్మాన్ని ముగించివేసి శలవు పుచ్చుకొన్నట్లుగా తండ్రిని చేరింది తల్లి....ఇప్పుడు తారకం ఏకాకి...బంధువులు ఎవ్వరూ సహాయపడలేదు...తన జీవితంలో మిగిల్చిన డబ్బుపెట్టి నిర్విఘ్నంగా ఉత్తరక్రియలు చేశాడు తల్లికి...ఆ విధంగా ఆమె ఋణాన్ని తీర్చుకున్నట్లుగా తృప్తి చెందింది అతని హృదయం...తల్లి పోయినప్పటినుండి మామగారు మాత్రం తగిన బాధ్యత వహించాడు...కొన్నాళ్ళకు జరుగవలసిన తంతు జరుగగా శాంత వచ్చింది ఆ యింట్లోకి...ఇప్పుడు ఇద్దరూ చిలకా-గోరింకలవలె జీవితాన్ని సాగిస్తున్నారు ఏమీ ఒడుదుడుకులు లేకుండా...ఇప్పుడు పూర్తిబాధ్యత తారకపై పడినది...ఇవన్నీ అనుభవాలే కాని వాటితో తారకానికి నిమిత్తం లేదు...ఆ అనుభవా లన్నిటికి తాళుకొని తాను తగిన సమాధానం చెప్పేది తన తల్లి...కష్టమైనా, సుఖమైనా తాను పొందేది అంతేగాని తారకానికి ఏమీ నిమిత్తములేకుండా వ్యవహరించేవాడు. తన తల్లి గతించినప్పటినుండి ఈ బాధ్యతలతో పాటు, అనుభవాలుకూడా అతన్ని ఆవరించాయి...వాటికి తగుసమాధానం ఇవ్వవలసిన బాధ్యత తనపై ఉన్నది. పోనీ, తన భార్యవలన తాను అనుభవం పొందవలసిన అగత్యం ఉన్నట్లుగా గోచరించలేదు. శాంత నిజంగా సరళ స్వభావురాలు. ప్రపంచం అంటే ఏమిటో తెలియని ముగ్ధ హృదయ...తాను ఎంత చెప్పితే అంత...తన మాటకు ఎదురు చెప్పే స్వభావం కించిత్తైనా ఆమెలో లేదు...ఆఫీసునుండి ఇంటికి రాగానే, గుమ్మంలో నిలబడి నవ్వుతూ స్వాగతం యిస్తుంది...దానితో ఆనాటి శ్రమల్లు మరచిపోయి ఆ నవ్వులో కరిగిపోతాడు...లోపలకు రాగానే కాళ్లు కడుగుకు నేందుకు నీళ్ళిచ్చి, తరువాత వెండిగ్లాసులో త్రాగేందుకు మంచినీళ్లు ఇస్తుంది...పురాణ కథల్లో చిత్రింపబడే భార్యకుండవలసిన లక్షణాలన్నీ తనలో ఉన్నాయని, వారికుండవలసిన గుణాలు పూర్తిగా కాకపోయినా కొంచెమైనా తనకు అలవడ్డాయని తృప్తి చెందుతుంది...దానితో పాటు తనవల్ల తన భర్త కొంత ఆనందాన్ని పొందుతున్నాడని గర్వపడేది ఆ లేత హృదయం...తారకం కూడా ఆమెకు కష్టంగా తోచే మాటలను ఇంతవరకు ఆమె ముందు అనియుండలేదు...తమది చాలా అనుకూల దాంపత్యమని, మరొక రెవరైనా అయితే తన దురదృష్ట రేఖ బయటపడేదనీ, సంతోష సాగరంలో ఈదులాడే వాడు తారకం...అట్టి భార్యాభర్తల మధ్య కలహాలు, పోట్లాటలు ఎందుకు వస్తాయి? ఒకవేళ వచ్చినా ఎవరో ఒకరు వాటికి తగు సమాధానం చెప్పుకొని ఇతరులను శాంతపరుస్తారు. తిరిగి యథాప్రకారంగా సాగిపోతుంది వారి జీవితం.

ఆనాడు ఆదివారం. శలవుకాబట్టి తీరుబడిగా కూర్చున్నాడు ఇంటివద్ద. ఏదో లోకాభిరామాయణంలో మునిగిఉన్నారు భార్యాభర్త లిద్దరూ. ఇంతలో పదిగంటలకు తారకంమామగారువచ్చారు. ముందుగా తెలియబర్చకుండా వచ్చే మనిషికాదు తారకం మామగారు. ఈనాడు అకస్మాత్తుగా వచ్చాడు ఉత్తరమైనా వ్రాయకుండా. అతనిరాక లోగల కారణాన్ని ఊహించలేకపోయాడు తారకం. కొలది కాలంలోనే తన రాకకుగల కారణాన్ని తనంతట తానే చెప్తాడనే ధైర్యంతో వూరుకున్నాడు. భోజనాలన్నీ ముగిసాయి. భోజనం దగ్గిరకూడా మామగారు తన రాకకుగల కారణాన్ని వివరించలేదు. అడగటం తనకు భావ్యంకాదని ఊరుకున్నాడు తారకం అప్పుడుకూడా. భోజనంచేసి తన పడకగదిలోనికి వెళ్ళి పడుకొని పత్రికపుటలు తిరగవేస్తున్నాడు. పుస్తకం చదువుతున్నాడేగాని తన మనస్సంతా మామగారి రాకమీద లగ్నమైనది. ఇంతలో పనంతా ముగించుకొని వచ్చింది కాంత. బహుశా కాంతకు తెలిసియుంటుంది తన మామగారు ఎందుకు వచ్చిన సంగతి. అడుగదల్చుకున్నాడు గాని ఇంతలోనే కాంత సహజంగా "మానాన్న నన్ను తీసుకొని వెళ్తాడుట ఈ నాలుగు గంటల బండీకు" అన్నది..."ఎందుకు?" అన్నప్రశ్న అప్రయత్నంగా వెలువడ్డది అతని పెదవులనుండి...తడబడకుండా కాంత "మా చెల్లెలు వచ్చిందట; నన్ను తీసుకురమ్మని కోరిందట...అందుకోసం వచ్చాడు మానాన్న" అన్నది...త్వరలోనే పుట్టింటికివెళ్ళి తన చెల్లెలను కలుసుకుంటాననే ఆత్రుత, ఆనందం స్పష్టంగాగోచరిస్తున్నాయి ఆమెలో...ఆ ఆనందంలో తనభర్తను కొంతకాలం దూరంగా ఉండవలసివస్తుందని, అందువల్ల తన భర్త ఏకాంత జీవితాన్ని సాగించాలనే విచారంగాని, ఆ ధమపత్నిం ఆ ఆలోచనగాని ఆ హృదయంలో తగినస్థానాన్ని పొందలేక పోయాయి...అతని భుజంపై రెండుచేతులు పెనవేసి ఎంతో ఆప్యాయంగా "మీకు యిష్టమైతే వెళ్ళి పది రోజులుండి వస్తాను...మీరుకూడా వస్తే అందరు సంతోషంగా కొన్నిరోజులు గడుపవచ్చు...తప్పక రావాలి" అని కాంత అంటూంటే ఎక్కడలేని ఆనందానుభూతిని పొందింది అతని మనస్సు...తను ఎల్లాగా రావటానికి వీల్లేదు...తెల్లవారితే ఆఫీసు చుట్టూ తిరగాలి...ఆ పరిస్థితులలో తన్ను తప్పకుండా పంపిస్తాడని ధైర్యం కలిగింది ఆమెకు...దానితోపాటు ఆమె అడిగినప్రశ్నకు సమాధానంగా చిరునవ్వు నవ్వాడు...తనభర్త తనకు ప్రసన్నుడైనపుడు ఆమె ఆనంద ప్రవాహానికి అడ్డుఉంటుందా...

నిజంగా చెప్పాలంటే ఆనాడు తారకంవద్ద దమ్మిడీకూడాలేదు...ఇంకా మూడురోజులు గడిస్తేనేగాని తన చేతికి డబ్బురాదు...ఇంతలో ఇంత అవాంతరం వస్తుందని కలగన్నాడా! డబ్బులేదన్న సంగతి భార్యతోచెప్తే ఆమె ఎంతగా దుఃఖిస్తుంది? ఆమె కండ్లవెంట కన్నీరురావటం తను చూడగలడా! పోనీ తనభార్యకు తెలుసుగా తనవద్ద డబ్బులేదని... అట్టి పరిస్థితులలో తన్ను పంపమని అడగటంలో ఆమెఉద్దేశ్యం ఏమైయుంటుంది? డబ్బులేకపోయినా ఎక్కడైనా అప్పుతెచ్చి తనకోరిక నెరవేరుస్తాడనేగా ఆమె ధైర్యం? ఆ దృఢనిశ్చయంతోనే అతన్ని పంపమని కోరుతోంది...ఆమాటల్లో నవ్యత్వం ప్రతిబింబిస్తోంది...ఎక్కడైనా తీసుకొనివచ్చి నన్ను పంపండి అనేభావం ఆమెమాటల్లో స్పష్టంగా గోచరిస్తోంది...ఒంటిగంటైనది. ఇంకా మూడుగంటల కాలం ఉన్నది...ఈ మూడుగంటలు ఇలా గడిస్తే తరువాత కలిగే ఫలితాన్ని ఊహించలేక పోయాడు తారకం...తన భార్యకోరికను నెరవేర్చటం తనవిధి అన్నట్లుగా లేచాడు...పైన కండువా వేసుకొని బయలుదేరాడు... "తొందరగా రండి" అని మాత్రం అవగలిగింది కాంత; తనపై అలిగి వెళ్ళుతున్నాడో, లేక మరొకపనిమీద వెళ్ళాడో గ్రహించలేక పోయింది కాంత...తనపై అలగటమనేది ఇంతకుముందు జరగలేదు...తప్పకుండా డబ్బుకోసమో లేక వేరొక పనిమీదో వెళ్ళుతున్నాడని తుదకు, దీర్ఘాలోచన తరువాత, నిశ్చయించింది కాంత...

ఇంటినుండి బయటపడ్డ తరువాత ఏమిచెయ్యాలో ఏమీపాలుపోవటంలేదు తారకానికి. తనెప్పుడు డబ్బుకోసం ఇతరులను యాచించలేదు... ఈనాడు తప్పనిసరిగా వెళ్ళి అడుగవలసిన పరిస్థితులు సమకూరాయి...తనుబయలుదేరిందికూడా డబ్బుకోసమే... అట్టి తరుణంలో ఇంకొకరిని అడగటం తప్పాగాతోచలేదు తారకానికి...ఎకాయెకిని తన తోటి గుమస్తా శంకరాన్ని అడిగాడు నిర్మొఖమాటంగా ... విచారాన్ని వెలిగ్రక్కుతూ ''బ్రదర్! నేనుకూడా నీలాగే ఉన్నానోయ్...ఇంకా నిన్నువచ్చి అడుగుదామనుకుంటున్నాను''అని అన్నాడు మిత్రుడు శంకరం... తనతో పరిచయంగా ఉంటున్నది అతనొక్కడే ... నెలాఖరురోజులు...ఎవరిదగ్గరా డబ్బుఉండదని తనకు తెలుసును...కాళ్లుఅరిగేలాగు తిరిగితే ఏమైనా లాభిస్తుందేమో! అప్పటికీ, తారకం అంటే అభిమానాన్నిచూపే రామచంద్రంగారి దగ్గరకుకూడా వెళ్లాడు. ఆయనకూడా వెనుకటి వానివలె సమాధానం ఇచ్చాడు...అప్పటికి రెండున్నరగంటలయింది ... ఇంకా తనకు, తనభార్యకు కొలదికాలం ఎడబాటు కలుగుటకు గంటన్నర వ్యవధి ఉన్నది...ఏమి చేయటానికి తోచక అలానిలబడి చూస్తున్నాడు ... అకస్మాత్తుగా ఏమిఆలోచన తట్టిందోగాని జేబులన్నీ వెతికాడు. ఆఖరుకు చొక్కాజేబులో చేడ డబ్బులుదొరికాయి వానితో ఎదురుగావున్న కాఫీ దేవాలయంలో ప్రవేశించి కాఫీసేవించి బయటకువచ్చి యథాస్థానంలో నిలబడిచూస్తున్నాడు పిచ్చివానివలె... గడియారము ముల్లు గిర్రున తిరిగిపోతోంది...తన్ను గురించి గాని, తనబోటి అసహాయులను గురించిగాని ఏమాత్రమైనా దయచూపుతుందా కాలం? లేకపోతే రెండుగంటల తిరుగుడు వ్యర్థమైపోయిందే! మూడు కొట్టింది...తనకు మంజూరుకాబడిన సెలవు అపూర్తవుతున్నది... పాపం! తనరాకకోసం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తూ వుంటుంది కాంత ... ప్రక్కన తాను రాకపోతే లోపల తిట్టుకుంటూ వుంటుందికాబోలు! 'సౌందరగారండి' అని మరీ హెచ్చరించింది వచ్చేటప్పుడు...తానురాకపోతే ఎంతగా విచారిస్తుందో



కేశ కలాపం

ఆ తలకట్టుపైననే మీ ముఖ సౌందర్యంయొక్క వృద్ధి క్షయములు ఆధారపడియున్నవి. ఆ సొగసు క్షీణింపకుండ కేశవర్ధినిచే వృద్ధిచేసుకొనుడు.

మంచి తలకట్టు లేక హీనముగా నుండుటకంటె విచారకరమైనది మరియొకటి లేదు. నష్టపడకుండ కురులను గట్టిపరచుటలో కేశవర్ధినికన్న వేరొకటిలేదు.

అందరు సుందరులు కాకపోవచ్చును. కాని సుందర వేణీభరము నందరూపొందవచ్చును. మీరు, కేశములు బాగుగా యుండినవాటిని అటులనే గట్టిపరచుకొనడు. కేశములు తక్కువగాయుండిన కేశవర్ధినిని వాడి వాటిని వృద్ధిపరచుకొనుడు. కేశవర్ధిని కేశవృద్ధికేకాక కేశములకు అందమునిచ్చును.

కేశవర్ధిని

నేడే వాడుడు.

కేశవర్ధిని అ. 12. కేశవర్ధిని సాంపు అ. 12.

ప్యాకింగు పోస్టేజి అధికము.

వర్తకులందరివద్దను దొరకును, లేక

సౌత్ ఇండియా కెమికల్స్

ఆర్. ఎస్. పురం, కోయంబత్తూరు.

కూడా ఇంటికి ఏవిధంగా రిక్తహస్తాలతో వెళ్ళగలడు? వెళ్ళినా డబ్బులేనిది ఏవిధంగా చెప్పగలడు? కాపురానికివచ్చిన తరువాత భార్య సాహసించి అడిగినది ఇదే ప్రథమం...అట్టికోరికను నెరవేర్చలేని తన అసహాయతకు తన్నుతానే ఎంతో నిందించుకున్నాడు. ఏమిలాభం? ఎంతో దీర్ఘంగా ఆలోచించాడు. తన హృదయసీమలో చక్కని తలపు మెరసింది కాబోలు. గబగబా ఆఫీసువైపునడిచాడు...తనబీరువా తెరచి కాగితాలకట్ట ముందరవేసుకొని తీవ్రంగా వ్రాయనారంభించాడు. ఆఫీసు గడియారం నాలుగు కొట్టింది...అప్రయత్నంగా అతనిచూపులు ఆ గడియారంమీదకు కేంద్రీకృతమయ్యాయి. ఈపాటికి తన మామగారు వెళ్ళిపోయియుంటారు. ఇంటిదగ్గర శాంత ఒక్కతేవుంటుంది దుఃఖిస్తూ...ఇంటికి వెళ్ళి తన అసహాయస్థితిని ఆమెముందు వెళ్ళబోసుకొని కొంచెము ఓరడింప వచ్చుననుకున్నాడు ... మామూలుగా తలదించి వ్రాస్తున్నాడు... ఏమిచేస్తున్నాడో తనకే తెలియదు...తిరిగి గడియారం ఆరు కొట్టింది...గుమస్తాలందరుఇండ్లకు వెళ్ళిపోయారు...తను ఒక్కడేఉన్నాడు ఆఫీసులో. అప్పటికితనకుకొంత శాంతంలభించింది...తలుపులు మూసి యింటివైపు మరలాడు... కాళ్లు బరువైన శరీరాన్ని మోసుకొని పోతున్నాయి ...సందు తిరిగాడు...ప్రతి రోజు చిరునవ్వుతో ఆహ్వానించే శాంత నేడు గుమ్మంలో లేదు...బహుశా లోపల ఏదో పని చేసుకొంటూన్నది కాబోలనుకున్నాడు... మెల్లిగా ఇంటి గుమ్మం ఎక్కాడు...వీధి తలుపులు బంధించబడి యున్నాయి...శాంతా! అని గట్టిగా రెండు సార్లు పిలచాడు...లోపల నుండి సమాధానంలేదు...ఆశ్చర్యపోతూ తలెత్తిచూశాడు ...ఇంకేమున్నది!...ఇంటికి తాళంవేయబడియున్నది ...నిశ్చేష్టుడై రెప్ప వాల్చకుండా అలాగే పైకి చూస్తూ నిలబడిపోయాడు. తన శాంత సాహసించి తనతో చెప్పకుండా వెళ్ళిపోతుందని కలలోనైనా భ్రమించలేదు...అడుగులకు మడుగులొత్తే తన శాంతేనా ఇంత ధైర్యంగా వెళ్ళిపోగలిగింది? శాంత యిటువంటిదని తెలిస్తే తాను వివాహమాడిఉండడు ...సరళస్వభావురాలైన శాంతనా ఇట్టి పని తలపెట్టింది?...నమ్మలేకపోయాడు...ఇంతలో ఎదురింటివారి అబ్బాయి వచ్చి ఏదో చీటీ ఇచ్చాడు...వణకుతున్న చేతులతో విప్పాడు.

"మీకోసం కండ్లు కాచేలాగు ఎదురుచూశాను. మీరు రాలేదు...మళ్ళీ నాతండ్రితో వెళ్ళి చెల్లెలుతో ఆనందంగా గడిపే తరుణం రాదు... నాకేమీ తోచనిస్థితిలో వున్నాను. అప్పుడు నాన్న సాహసించి బయలుదేర మన్నాడు...మీ సంగతి తనకు బాగా తెలుసునని, మీరేమీ బాధపడరనీ నచ్చచెప్పాడు...ఆయన మాటమీద బయలుదేరి వెళ్ళిపోతున్నాను...మీరు నిజంగా నాయందు ప్రేమగాఉంటే, నన్ను తప్పక క్షమిస్తారనీ ప్రార్థిస్తున్నాను...మీరుకూడావస్తే అందరం ఆనందంగా కొన్నాళ్ళు అక్కడ వుండవచ్చు...తప్పక రావలసినదిగా కోరుతున్నాను...క్షమించండి...అన్నంవండి పెట్టాను...భోజనం చెయ్యండి...తిరిగి పదిరోజులలో వస్తాను...శలవు..."మీ శాంత" ...తన నిస్సహాయ స్థితిని ఎంత చక్కగా వర్ణించింది—నిజమే.. ఆమె ఆనందానికి అంతరాయం కలిగించుటకు తనకు ఏమాత్రం అధికారం ఉన్నది? ఆమె ఆనందమే తన ఆనందమని తాను భావించ గలిగిననాడు ఆమె చేసినది ఎలా తప్పుగా తలుస్తాడు?...తనవద్ద డబ్బు లేకపోతే, ఆమెకు తెలియబరుస్తే తనమామగారే తనకు డబ్బు యిస్తారుగా...అయినా ఈ మాత్రం దానికి తను బాధపొందటం అనవసరం...ఆమె క్షమించమని కోరుతున్నపుడు క్షమించవలసిన విధి తనపై వున్నది...ఈ అనుభవానికి తగిన ప్రాముఖ్యాన్ని ఇస్తే తమ భావిజీవితం ఎలా పరిణామం చెందుతుందో గ్రహించుకున్నాడు...ఇక జీవితమంతా ఇద్దరిమధ్య కలహాలతోనూ, పోట్లాటలతోనూ నిండిపోతుంది...

తత్క్షణం ఎదురింటివారి దగ్గర డబ్బుతీసుకొని మర్నాడు ఉదయమే అత్తవారింటికి పయనమయ్యాడు తారకం. తారకం ఏ రకానికి చెందుతాడో చెప్పండి!